సాక్షి కామారెడ్డి

శుక్రవారం । 21 । జూలై । 2023



వంతెన నిర్మించేదెప్పుడో?

కల్యాణి వాగుపై వంతెన లేకపోవడంతో కల్యాణి, రత్నాపూర్‌వాసులు ఇబ్బందులు పడుతున్నారు.

- 9లో ▸



'ఉపాధి'లో అక్రమాలు

ఉపాధి హామీ పథకంలో అవకతవకలు జరుగుతున్నా అక్రమార్కులపై చర్యలు తీసుకోవడం లేదు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
29.6 /21.7

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నీటి పారుదల శాఖ డీఈ బదిలీ

సాక్షి, కామారెడ్డి: నీటి పారుదల శాఖ తాడ్వాయి సబ్ డివిజన్ డీఈ ఎం.గోపీనాథ్ బదిలీ అయ్యారు. ఆయనను మిర్యాలగూడకు బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో జీవీ గూడెంలో పనిచేస్తున్న జే.మనోహర్‌రెడ్డికి పోస్టింగ్ ఇచ్చారు.

కామారెడ్డి డీఎస్పీగా ఆర్. ప్రకాశ్

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి(డీఎస్పీ)గా ఆర్.ప్రకాశ్ నియమితులయ్యారు. ఇక్కడ పనిచేసిన సురేశ్ ఇటీవల తొర్రూర్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో వెయిటింగ్‌లో ఉన్న ప్రకాశ్‌కు పోస్టింగ్ ఇస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పీసీసీ ఎలక్షన్ కమిటీలో షబ్బీర్ అలీకి చోటు!



సాక్షి, కామారెడ్డి: తెలంగాణలో ఎన్నికల కోసం కాంగ్రెస్ పార్టీ సన్నద్ధమవుతోంది. ఇందులో భాగంగా గురువారం పీసీసీ ఎలక్షన్ కమిటీని ప్రకటించింది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి చైర్మన్‌గా ఉండే కమిటీలో కామారెడ్డికి చెందిన మాజీ మంత్రి, సీనియర్ నాయకుడు మహ్మద్ అలీ షబ్బీర్‌కు స్థానం కల్పించారు. ఆయన ఇప్పటికే పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

'బెస్ట్ అవైలబుల్ స్కీం'కు లక్కీడ్రా



కామారెడ్డి క్రైం: బెస్ట్ అవైలబుల్ స్కూల్ పథకంలో భాగంగా 1, 5 తరగతుల్లో ప్రవేశాల కోసం గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ఆధ్వర్యంలో లక్కీడ్రా నిర్వహించారు. ఒకటో తరగతిలో 64 సీట్లకు 70, ఐదో తరగతిలో 72 సీట్లకు 84 దరఖాస్తులు వచ్చాయి. 36 మంది డ్రాపౌట్ కాగా.. వారి స్థానంలో 15 మందికి తక్షణ ప్రవేశాలు కల్పించారు. కార్యక్రమంలో ఎస్సీ అభివృద్ధి అధికారి వెంకటేష్, పర్యవేక్షకులు కవిత, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన'



కామారెడ్డి క్రైం: ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి కలెక్టరేట్‌లో ఈవీఎం, వీవీ ప్యాట్‌ల ప్రదర్శన కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కేంద్రాన్ని గురువారం రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకొని ఓటింగ్ యంత్రాలపై చైతన్యం పొందాలని సూచించారు.

ఎస్సారెస్పీలోకి పెరిగిన వరద

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి గురువారం 59,615 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు నీటి నిల్వ 38 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువ ద్వారా 50 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 360 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 359 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 152 క్యూసెక్కుల నీరు పోతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1091అడుగులు(90 టీఎంసీలు) కాగా గురువారం రాత్రికి ప్రాజెక్టులో 1074అడుగుల(38 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు పేర్కొన్నారు.

నేడు జిల్లాకు యూఎస్ కాన్సులేట్ బృందం

డొంకేశ్వర్(ఆర్మూర్): అమెరికన్ కాన్సులేట్ అధికారుల బృందం శుక్రవారం జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయానికి రానుంది. ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని కార్యాలయానికి చేరుకుని వ్యవసాయాధికారులతో సమావేశమవుతారు. అనంతరం రైతులతో మాట్లాడేందుకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లే అవకాశముంది. వివిధ అంశాలపై రైతులతో సర్వే చేయడానికి యూఎస్ కాన్సులేట్ అధికారులు వస్తున్నట్లు తెలిసింది.

దంచికొట్టిన వాన!



లింగంపేట: అలుగు పారుతున్న పోతాయిపల్లి టేకుల చెరువు

- జిల్లావ్యాప్తంగా భారీ వర్షాలు
- సదాశివనగర్‌లో 10 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు
- పొంగిపొర్లుతున్న వాగులు
- ప్రాజెక్టుల్లో పెరుగుతున్న నీటిమట్టం

జిల్లావ్యాప్తంగా వర్షాలు దంచికొడుతున్నాయి. నాలుగు రోజులుగా తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో వాగులు, వంకలు పారుతున్నాయి. చెరువులు, ప్రాజెక్టులలో కొత్త నీరు చేరుతుండడంతో జలకళ కనిపిస్తోంది.

సాక్షి, కామారెడ్డి : జిల్లావ్యాప్తంగా వానలు విస్తారంగా పడుతున్నాయి. గురువారం జిల్లాలో అత్యధికంగా సదాశివనగర్‌లో 10 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా నస్రుల్లాబాద్‌లో 21.2 మి.మీటర్ల వాన పడింది. నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. పోచారం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో నిండుకుండలా మారింది. మంజీర నదిలోనూ ప్రవాహం పెరిగింది. నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. నల్లవాగు, పెద్దవాగు, పాల్వంచవాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దాదాపు అన్ని చెరువులు, కుంటల్లోకి నీరు వచ్చి చేరింది. కొన్ని చోట్ల అలుగులు పారుతున్నాయి. జిల్లాలో గురువారం నాటికి సాధారణ వర్షపాతం 294 మి.మీ. కాగా.. ఇప్పటికే 354.2 మి.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణం కన్నా 20 శాతం అదనంగా వర్షాలు కురిశాయి. జూన్‌లో వర్షాల్లేక ఇబ్బందిపడ్డ రైతులు ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో ఊరట చెందారు.

జిల్లాలో నమోదైన వర్షపాతం..

మండలం	వర్షపాతం (మి.మీ.)	మండలం	వర్షపాతం
		భిక్కనూరు	63.7
సదాశివనగర్	100.3	మాచారెడ్డి	58.5
గాంధారి	95.2	దోమకొండ	57.6
రామారెడ్డి	85.6	బీబీపేట	54.2
నాగిరెడ్డిపేట	81.4	పల్వంచ	54.0
కామారెడ్డి	78.6	పెద్దకొడప్‌గల్	52.1
తాడ్వాయి	71.8	నిజాంసాగర్	48.5
రాజంపేట	69.0	పిట్లం	41.2
ఎల్లారెడ్డి	66.9	బాన్సువాడ	32.0
లింగంపేట	65.1	నస్రుల్లాబాద్	21.2

దెబ్బతిన్న రోడ్లు..

పిట్లం మండలం తిమ్మనగర్ శివారులోగల నల్లవాగు పొంగిపొర్లుతుండడంతో వాగులో తాత్కాలికంగా వేసిన రోడ్డు కొట్టుకుపోయింది. దీంతో ఈ మార్గంలో కామారెడ్డి -సంగారెడ్డి జిల్లాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గాంధారి మండలంలోని తిమ్మాపూర్ శివారులోగల చెరువు కట్టకు బుంగ పడడంతో నీరు వృథాగా పోతోంది. లింగంపేట మండలంలోని మెంగారం శివారులో మర్రి చెట్టు కూలిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. లింగంపేట పెద్దవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. కామారెడ్డి పెద్ద చెరువు నిండుకుండలా మారింది. పలు చోట్ల చెట్లు, పాత ఇళ్లు కూలిపోయాయి. రోడ్లు దెబ్బతిన్నాయి.



గాంధారి: తిమ్మాపూర్ చెరువు కట్టకు పడిన బుంగను పరిశీలిస్తున్న అధికారులు



పిట్లం: తిమ్మనగర్ నల్లవాగు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక రోడ్డు



నాగిరెడ్డిపేట : గోలిలింగాల శివారులో ఉధృతంగా పారుతున్న మంజీర నది

నిజాంసాగర్‌లోకి భారీ వరద

నిజాంసాగర్: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గురువారం మంజీర నదికి వరద పోటెత్తింది. మెదక్ జిల్లాలోని ఘనపురం ఆనకట్ట అలుగు దూకుతోంది. హల్దీవాగు కూడా పొంగిపొర్లుతోంది. దీంతో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వస్తోంది. గురువారం సాయంత్రం 6 గంటల సమయంలో నిజాంసాగర్ ప్రాజెక్టులోకి 23,400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో 27,200 క్యూసెక్కులకు చేరిందని పేర్కొన్నారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా.. గురువారం సాయంత్రానికి 1,391.61 అడుగుల (4.779 టీఎంసీలు) నీరు నిల్వ ఉందని పేర్కొన్నారు.



సింగితం నీటిమట్టం

సింగితం రిజర్వాయర్‌కు జలకళ

ఎగువన వర్ని, బాన్సువాడ, నిజాంసాగర్ మండలాల్లో కురుస్తున్న వర్షాలకు మండలంలోని సింగితం రిజర్వాయర్‌లోకి 500 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. సింగితం రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 416.5 మీటర్లు కాగా ప్రసుత్తం 414.7 మీటర్ల నీరుందన్నారు.



నిజాంసాగర్: మంజీర నదిలో వరద నీటి ప్రవాహం

రోడ్డుపై కూలిన మర్రిచెట్టు



మెంగారం శివారులో కూలిన మర్రి చెట్టును తొలగిస్తున్న దృశ్యం

లింగంపేట: భారీ వర్షానికి మెంగారం శివారులోని మర్రి చెట్టు రోడ్డుపై కూలిపోయింది. దీంతో రెండు గంటల పాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ మార్గంలో వెళ్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ వెంటనే రెండు పొక్లెయిన్‌లను తెప్పించి, చెట్టును తొలగింపజేశారు.

నిండుకుండలా 'పోచారం'



నీటిమట్టాన్ని పరిశీలిస్తున్న డీఈఈ వెంకటేశ్వర్లు

నాగిరెడ్డిపేట: పోచారం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరువలోకి వచ్చింది. గురువారం సాయంత్రం 9,331 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు. రాత్రికి 6,909 క్యూసెక్కులకు తగ్గింది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 21 అడుగులుకాగా గురువారం రాత్రికి 19 అడుగుల నీరుంది. ప్రాజెక్టును గురువారం ఇరిగేషన్ డీఈఈ వెంకటేశ్వర్లు పరిశీలించారు. ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతున్నందున అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు.



పోచారం ప్రాజెక్టు నీటిమట్టం

ప్రమాదపు అంచున పెద్దాసుపత్రి

- ఊరుస్తున్న ఆస్పత్రి భవనం
- బాలింతల వార్డులో ఊడిపడ్డ పీవోపీ
- తప్పిన ముప్పు
- గోడలకు తేమతో ప్రమాదకరంగా స్విచ్‌బోర్డులు
- ఆందోళనలో రోగులు, సిబ్బంది



శిథిలావస్థలో ఉన్న జిల్లా కేంద్ర ఆస్పత్రి భవనం

కామారెడ్డి టౌన్: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో జిల్లాకేంద్ర ఆస్పత్రి అధ్వానంగా మారింది. పైకప్పు ఊరుస్తుండడంతో ఎక్కడ చూసినా నీరే కనిపిస్తోంది. గోడలకు తేమ రావడంతో స్విచ్‌బోర్డులు ప్రమాదకరంగా మారాయి. ఆస్పత్రి మొదటి అంతస్తు రేకుల షెడ్డులో ఏర్పాటు చేసిన పోస్ట్ మెటర్నిటీ వార్డులో బుధవారం రాత్రి పీవోపీ కొంత భాగం ఊడి కిందపడిపోయింది. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో వార్డులోని బాలింతలు, వారి బంధువులు ఉలిక్కిపడ్డారు. అప్రమత్తమైన అధికారులు వెంటనే వార్డులోని వారిని ఆరోగ్యశ్రీ, మహిళల వార్డులకు తరలించారు. అన్ని వార్డులలోనూ నీరు ఊరుస్తోంది. నీరు కిందపడకుండా చాలాచోట్ల డబ్బాలను ఉంచారు. అయినా ఆస్పత్రి ఆవరణ అంతా చిత్తడిగా మారింది. గ్రౌండ్ ఫ్లోర్‌లో పైకప్పు కున్న పీవోపీ తడిసిపోయింది. అది ఎప్పుడు పడిపోతుందోనని ఆందోళన చెందుతున్నారు.

ఇతర వార్డుల్లో..

ఆస్పత్రిలోని శిశువుల చికిత్సల విభాగం(ఎస్ఎన్‌సీయూ)లో గోడలకు తేమ వస్తోంది. దీంతో స్విచ్‌బోర్డులు ప్రమాదకరంగా మారాయి. ఈ వార్డులో ఇంక్యుబేటర్‌లలో శిశువులకు చికిత్స అందిస్తుంటారు. స్విచ్‌బోర్డులు తడిసిపోయి ఉండడంతో ప్రమాదం జరుగుతుందేమోనని సిబ్బంది భయపడుతున్నారు. రెండు రోజుల క్రితం ఆపరేషన్ థియేటర్‌లో స్విచ్ బోర్డులోకి నీరు రావడంతో షార్ట్ సర్క్యూట్ అయ్యింది. తాత్కాలిక మరమ్మతులు చేయించారు.

ఆస్పత్రి ఘటనపై మంత్రి ఆరా

జిల్లాకేంద్ర ఆస్పత్రిలో లీకేజీలు, పీవోపీ పడిపోవడం ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు స్పందించారు. గురువారం ఆయన వైద్యాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన మరమ్మతులు చేయించాలని సూపరింటెండెంట్ విజయలక్ష్మిని, ఆస్పత్రి అధికారులను మంత్రి ఆదేశించారు.

నూతన నిర్మాణాల్లో సైతం..

మెడికల్ కళాశాల కోసం జిల్లా కేంద్ర ఆస్పత్రి రెండో అంతస్తులో అదనపు వార్డుల కోసం రేకుల షెడ్డు ఏర్పాటు చేస్తున్నారు. ఈ క్రమంలో లీకేజీలు ఏర్పడి భవనమంతా నీరు కారుతోందని ఆస్పత్రి వర్గాలు పేర్కొంటున్నాయి. గోడలకు తేమ వస్తోంది.



ఎస్ఎన్‌సీయూలో గోడలకు తేమ



ఊరుస్తున్న నీరు పడకుండా ఉంచిన బుట్టలు



శిశువుల విభాగంలో స్విచ్‌ల వద్ద తేమ..

మైనారిటీల అభ్యున్నతికి కృషి చేయాలి

- జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ



మాట్లాడుతున్న షెహజాదీ

కామారెడ్డి క్రైం: మైనారిటీల సంక్షేమంపై దృష్టి సారించాలని జాతీయ మైనారిటీ కమిషన్ సభ్యురాలు సయ్యద్ షెహజాదీ సూచించారు. గురువారం కామారెడ్డికి వచ్చిన ఆమెకు కలెక్టరేట్ వద్ద అదనపు కలెక్టర్ చంద్రమోహన్, ఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం కలెక్టరేట్‌లో ప్రధానమంత్రి 15 సూత్రాల కార్యక్రమం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై సంబంధిత శాఖల అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. జిల్లాలో మైనారిటీల స్థితిగతులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలు ద్వారా చేకూరుతున్న లబ్ధి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కేజీబీవీలు, మైనారిటీ గురుకులాలలో విద్యార్థుల సంఖ్య, మదర్సాలలో సదుపాయాలు, మైనారిటీలకు ఏర్పాటు చేసిన శిక్షణ కేంద్రాలు తదితర పథకాల అమలుతీరును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రధానమంత్రి 15 అంశాల కార్యకమంపై ప్రతి మూడు నెలలకు ఒకసారి కమిటీ సమావేశాలు నిర్వహించాలన్నారు. సభ్యులు మాట్లాడుతూ వక్ఫ్ భూములను కాపాడడంతోపాటు శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయించాలని, నిబంధనల మేరకు చర్చిల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని కోరారు. వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవాలని షెహజాదీ అధికారులకు సూచించారు. సమావేశంలో జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి దయానంద్, ఆర్డీవోలు శ్రీనివాస్‌రెడ్డి, రాజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్షలు వాయిదా

తెయూ(డిచ్‌పల్లి): విస్తారంగా కురుస్తున్న వర్షాల కారణంగా ప్రభుత్వం విద్యాసంస్థలకు రెండు రోజుల సెలవులు ప్రకటించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో గురువారం, శుక్రవారం (20, 21వ తేదీల్లో) జరగనున్న పీజీ సెమిస్టర్ పరీక్షలు, యూజీ ప్రాక్టికల్స్, ప్రాజెక్టు వర్క్ పరీక్షలను వాయిదా వేస్తున్నట్లు కంట్రోలర్ ఎం అరుణ తెలిపారు. 22న పరీక్షలు యథావిధిగా జరుగుతుందని, వాయిదా వేసిన పరీక్షల తేదీలు త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

ఆర్టీసీలో బదిలీలు



ఖలీల్‌వాడి: నిజామాబాద్ ఆర్టీసీలో పదోన్నతులు, బదిలీలు గురువారం జరిగాయి. బోధన్ డిపో మేనేజర్ స్వామిని హైదరాబాద్‌లోని హెడ్ ఆఫీస్‌కు బదిలీ చేయగా ఆయన స్థానంలో నిజామాబాద్–2 డిపోలోని అసిస్టెంట్ మేనేజర్ (మెకానిక్) శ్రీనివాస్ పదోన్నతిపై బోధన్ డిపో మేనేజర్‌గా వెళ్లారు. ఆర్మూర్ డిపో మేనేజర్ కవితను హైదరాబాద్‌లోని చెంగిచెర్ల డిపో మేనేజర్‌గా బదిలీ చేయగా ఆమె స్థానంలో పెద్దపల్లి జిల్లాలోని మంథని డిపోలో అసిస్టెంట్ మేనేజర్‌గా ఉన్న శ్రీనివాస్ పదోన్నతిపై ఆర్మూర్ డిపో మేనేజర్‌గా నియమితులయ్యారు.

పంటల నమోదు పరిశీలన



ఇందల్వాయి: మండలంలోని వెంగల్పాడులో ఇన్‌చార్జి జిల్లా వ్యవసాయ అధికారి వాజిద్ హుస్సేన్ గురువారం పర్యటించారు. ఏఈవోలు చేపట్టిన పంట నమోదు వివరాలను తెలుసుకున్నారు. సర్వే నంబర్ల ప్రకారం రైతులు సాగు చేసిన పంటల వివరాలను పక్కాగా నమోదు చేయాలన్నారు. మండల వ్యవసాయ అధికారి ప్రవీణ్ కుమార్, ఏఈవోలు శ్రీహరి, ప్రకాష్‌గౌడ్, సతీష్ ఉన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం వాయిదా

నిజామాబాద్ అర్బన్: జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో టీఎన్‌జీవో భవన్‌లో శుక్రవారం జరగాల్సిన వ్యాయామ ఉపాధ్యాయుల సమావేశం వాయిదా వేసినట్లు డీఈవో దుర్గాప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తున్న కారణంగా ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. మళ్లీ సమావేశాన్ని ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేస్తామన్నారు.

అడిషనల్ డీసీపీ మధుసూదన్‌రావు బదిలీ

ఖలీల్‌వాడి: నిజామాబాద్ స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా పని చేసిన మధుసూధన్‌రావుకు అడిషనల్ డీసీపీగా పదోన్నతి రావడంతో హైదరాబాద్‌లోని నార్త్ జోన్‌కు బదిలీ అయ్యారు. డీసీపీలు బదిలీపై వెళ్లడంతో పోలీసుశాఖలో సీనియర్ అధికారి కావడంతో ఆయన జిల్లాలో ఇన్‌చార్జి అడిషనల్ డీసీపీ(అడ్మిన్)గా పనిచేశారు.

నిజామాబాద్‌లో బెస్ట్ అవైలబుల్ స్కీం లక్కీ డ్రా



సుభాష్‌నగర్: జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ స్కీం కింద ఆయా పాఠశాలల్లో ప్రవేశాల కోసం గురువారం లక్కీ డ్రా ప్రక్రియ నిర్వహించారు. కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో అదనపు కలెక్టర్ యాదిరెడ్డి పర్యవేక్షణలో, విద్యార్థులు వారి తల్లిదండ్రుల సమక్షంలో డ్రా కొనసాగింది. ఒకటో తరగతిలో ప్రవేశాలు కోరుతూ 433 మంది దరఖాస్తు చేసుకోగా, డ్రా ద్వారా 102 మందికి ప్రవేశాలు కల్పించారు. అదేవిధంగా ఐదో తరగతిలో ప్రవేశం కోరుతూ మొత్తం 511 మంది దరఖాస్తులు చేసుకోగా, డ్రా విధానం ద్వారా 101 మందికి ప్రవేశాలు కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారిణి శశికళ తెలిపారు.

ఉపాధి హామీలో అక్రమాలు

- మూడేళ్లలో భారీ అవకతవకలు
- ప్రజావేదికలో బయటపడినా చర్యలు శూన్యం
- పంచాయతీ కార్యదర్శుల చేతివాటం



ప్రజా వేదిక నిర్వహిస్తున్న ఆడిట్ అధికారులు (ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): గ్రామాల్లో నిరుపేదలకు పనులు కల్పించడం కోసం ప్రభుత్వ ఏర్పాటు చేసిన ఉపాధి హామీ పథకం అక్రమార్కులకు ఏటీఎంలా మారింది. ఉపాధి పనులను ఆసరాగా చేసుకుని అటు పంచాయతీ కార్యదర్శులు,ఇటు ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్‌లు మృతుల పేరిట, పెళ్లయి ఇతర గ్రామాలకు వెళ్లిన వారి పేరిట, ఆరోగ్యం బాగాలేక ఇంటి వద్ద ఉన్న వారి పేరిట, పనులు చేయకున్నా కూడా కుటుంబ సభ్యుల పేరిట బిల్లులు రాయించుకుని తీసుకుంటున్నారు.ఈ ఘటనలు ఆడిట్‌లో బయటపడినా కేవలం మెమోలు ఇచ్చి వదిలేస్తున్నారు.

పని చేయకున్నా ఖాతాలలో డబ్బులు

నస్రుల్లాబాద్ మండలంలోని మైలారం గ్రామంలో ఫారెస్టు గుట్టకు బదులు కందకాల్లో పని చేసినట్లు చూపించి రూ.12,801 కూలి కాజేశారు. కుటుంబ సభ్యులు పనిచేయకున్నా కూడా పనిచేసినట్లు చూపి రూ.650 చెల్లించారు. గడ్డం విజయ లక్ష్మి అనే మహిళ ఐదేళ్లుగా పని చేయకున్నా రూ.1,227 కూలి చెల్లించారు. గోనే మహేందర్ అనే వ్యక్తి చనిపోయిన తర్వాత కూడా పని చేసినట్లు రూ.700 కూలి చెల్లించారు. మిర్జాపూర్‌లో గ్రూప్ సభ్యుల అందరి సంతకాలను పెట్టి రూ.33,110లను కూలి చెల్లించారు. అలాగే మిర్జాపూర్‌లో మస్టర్ క్లోజ్ అయిన తర్వాత కూలీల సంతకాలు పెట్టి రూ.33,685ల పేమెంట్ చేశారు. బీర్కూర్ మండలంలోని బరంగేడ్గి చెందిన సందుల రాంబాయి అనే పంచాయతీ కార్యదర్శి పని చేయకున్నా పని చేసినట్లు రూ.6,086 నగదును ఆయన ఖాతాలో జమ చేశారు. బైరాపూర్‌లో కారోబార్, ఆయన భార్య పని చేయకుండానే పని చేసినట్లు మస్టర్లలో చూపి మూడు వారాల కూలి ఖాతాల్లో వేశారు. ప్రజా వేదికలో జిల్లా స్థాయి అధికారులు సంబంధిత పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లపై చర్యలు తీసుకుని కాజేసిన డబ్బులను రికవరీ చేయించాలని నివేదికలను అందించారు. కానీ మండల స్థాయి అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడకపోవడం వెనుక పలు అనుమానాలకు దారి తీస్తుంది.

> **పారదర్శకంగా జరిగేలా చూస్తాం**
>
> ఉపాధి హామీ పనులు పారదర్శకంగా జరిగేలా చూస్తున్నాం. పనికి ముందు, పని చేసిన తర్వాత ఫొటోలు తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల నుంచి నోటీసులు రాగానే రికవరీ పనులు చేపడుతాం.
>
> – సుబ్రహ్మణ్యం, ఎంపీడీవో, నస్రుల్లాబాద్

బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సురేందర్



రామారెడ్డి ధర్నా చేస్తున్న కాంగ్రెస్ నాయకుల

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్
- కాన్వాయ్‌ను అడ్డుకున్న కాంగ్రెస్ నాయకులు
- సమస్యలను ఏకరువు పెట్టిన గ్రామస్తులు

రామారెడ్డి: బీఆర్‌ఎస్ సర్కార్‌తోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ పేర్కొన్నారు. గురువారం కన్నాపూర్ రైతు వేదికలో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలో చేసిన అభివృద్ధి ఏమిటో చూపించాలని కాంగ్రెస్ నేతలకు సవాల్ చేశారు. తన పదవీకాలంలో ఎనిమిదిసార్లు గ్రామాన్ని సందర్శించానని, సీసీ రోడ్లు, డ్రైయినేజీల నిర్మించానని పేర్కొన్నారు. అవినీతి పాలన కోసమే కాంగ్రెస్ నాయకులు వీధి పోరాటాలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దశరథ్‌రెడ్డి, వైస్‌ఎంపీపీ రవీందర్‌రావు, సర్పంచ్ రాజనర్స్, ఉపసర్పంచ్ అంజల్‌రెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే దృష్టికి సమస్యలు..

కన్నాపూర్ గ్రామ సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. కన్నాపూర్ నుంచి కామారెడ్డికి వెళ్లే మార్గంలో వంతెన నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని పేర్కొన్నారు. సీసీ రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, రైతు వేదికకు వెళ్లే మార్గం బురదమయంగా ఉందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.

కాన్వాయ్‌ను అడ్డుకుని నిరసన

కన్నాపూర్‌కు వస్తున్న ఎమ్మెల్యేను మార్గమధ్యలో కన్నాపూర్ తండా వద్ద కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. 24 గంటల ఉచిత విద్యుత్ ఎక్కడ ఇస్తున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. తమపార్టీ నాయకుల అరెస్టుకు నిరసనగా నాలుగు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు తరలివచ్చి పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేశారు. రేవంత్‌రెడ్డిపై ఎమ్మెల్యే సురేందర్ చేసిన వ్యాఖ్యలకు నిరసనగానే కాన్వాయ్‌ని అడ్డుకున్నామని పేర్కొన్నారు. ఆందోళన చేస్తున్న జెడ్పీ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మోహన్‌రెడ్డి, పోసానిపేట సర్పంచ్ మహేందర్‌రెడ్డి పోలీసులు స్టేషన్‌కు తరలించారు.

మంజూరైన పనులు పూర్తి చేయాలి

- జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

నిజామాబాద్‌నాగారం: జిల్లాకు 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన పనులను త్వరగా పూర్తి చేయాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు ఆదేశించారు. గురువారం జిల్లా పరిషత్‌లో స్థాయి సంఘ సమావేశం సాంఘిక సంక్షేమ కమిటీ చైర్‌పర్సన్ దాసరి ఇందిరా లక్ష్మీనర్సయ్య అధ్యక్షతన జరిగింది. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక సంఘం, 15వ ఆర్థిక సంఘం ద్వారా 2020–21 నుంచి 2022–23 వరకు మంజూరైన పనులు త్వరగా పూర్తి చేయించాలని పంచాయతీ రాజ్, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఆదేశించారు. భారీ వర్షాలు కురుస్తున్నందునా అప్రమత్తంగా ఉండాలన్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు అవసరమైన సదుపాయాలు కల్పించుటకు చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే మంజూరు రుణాలు అన్ని గ్రౌండ్ అయ్యే విధంగా చూడాలని అధికారులకు ఆదేశించారు. జెడ్పీ సీఈవో గోవింద్, జెడ్పీటీసీలు అంబర్ సింగ్, మ్యాక విజయ, భాస్కర్ రెడ్డి, తనూజ, పంచాయతీ రాజ్ ఎస్‌ఈ ప్రభాకర్, ఈఈలు బావన్న, శంకర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

పలువురి అదృశ్యం

రామారెడ్డి: మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చెందిన ఓ యువతి అదృశ్యమైనట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సదరు యువతి బుధవారం ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

భిక్కనూరులో విద్యార్థి..

భిక్కనూరు: మండల కేంద్రంలో ఒక విద్యార్థి కనిపించకుండా పోయాడని ఎస్సై ఆనంద్‌గౌడ్ గురువారం తెలిపారు. గ్రామానికి చెందిన కర్నాల నారాయణ కుమారుడు సాత్విక్ రామారెడ్డిలోని హాస్టల్‌లో ఉంటు చదువుకుంటున్నాడు. ఈ నెల 17న ఇంటికి వచ్చాడు. 19న పాలకేంద్రానికి వెళ్లి పాలు తెమ్మని సాత్విక్‌కు తల్లి విజయ సూచించింది. బైక్ ఇస్తేనే పాలు తెస్తానని సాత్విక్ అనడంతో తల్లి ఒప్పుకోలేదు. దీంతో కోపంతో ఇంట్లో నుంచి వెళ్లిన సాత్విక్ తిరిగి రాలేదు. తండ్రి నారాయణ పోలీసులకు పిర్యాదు చేశాడు.

సిర్నాపల్లిలో వివాహిత..

ఇందల్వాయి: ఇందల్వాయి మండలం సిర్నాపల్లికి చెందిన జంగం శిరీష(25) గురువారం నుంచి కనపడటం లేదని ఆమె అత్త మణియమ్మ ఫిర్యాదు చేసినట్లు ఎస్సై మహేశ్ తెలిపారు. మణియమ్మ చిన్న కుమారుడు రంజిత్‌కు సదాశివనగర్ మండలం దగ్గి గ్రామానికి చెందిన శిరీషతో ఏడేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఒక కొడుకు, కూతురు ఉన్నారు. జీవనోపాధి కోసం రంజిత్ గల్ఫ్ వెళ్లాడు. బుధవారం రాత్రి నుంచి శిరీష కనిపించడం లేదు. పలుచోట్ల గాలించినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె అత్త పోలీసులకు ఫిర్యాదు చేసింది. గ్రామానికి చెందిన శ్రీకాంత్ అనే యువకుడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొంది.

ఆలయాల్లో చోరీ

నవీపేట: మండలంలోని మూడు గ్రామాల్లోని ఆలయాల్లో గురువారం తెల్లవారుజామున చోరీ జరిగింది. బినోలలోని నల్ల పోచమ్మ ఆలయం, గాంధీనగర్‌లోని రామాలయం, హనుమాన్ ఫారమ్‌లోని హనుమాన్ ఆలయాల్లో దొంగలు చోరీ చేశారు. దేవతల విగ్రహాలపై ఉన్న వెండి ఆభరణాలతో పాటు ఆలయాల్లోని హుండీలు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లినట్లు ఆయా గ్రామస్తులు పేర్కొన్నారు.

బర్కత్‌పురా కాలనీలో బైక్..

ఖలీల్‌వాడి: నిజామాబాద్‌లోని బర్కత్‌పుర కాలనీలో ఓ హోటల్ వద్ద పార్కింగ్ చేసిన బైక్‌ను దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితుడు మహ్మద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై అశోక్ తెలిపారు.

నంబర్ ప్లేట్లు లేని బైక్‌లు స్వాధీనం

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పెద్దబజార్ వద్ద గురువారం డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేసినట్లు ఎస్సై అశోక్ తెలిపారు. నంబర్ ప్లేట్లు లేని మూడు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

రెండు కేజ్‌వీల్ ట్రాక్టర్లు సీజ్

గాంధారి: తారు రోడ్డుపై తిరుగుతున్న రెండు కేజ్‌వీల్ ట్రాక్టర్లను గురువారం సీజ్ చేసినట్లు ఎస్సై సుధాకర్ తెలిపారు. పోతంగల్ శివారులో తారురోడ్డుపై కేజ్‌వీల్ ట్రాక్టర్లను యజమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. తారు రోడ్లపై కేజ్‌వీల్ తిప్పడం నేరమని ఆయన అన్నారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

ఇరిగేషన్ కార్యాలయంలో ఫ్లడ్ కంట్రోల్‌రూం ఏర్పాటు

సుభాష్‌నగర్: జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలను దృష్టిలో పెట్టుకొని జిల్లా కేంద్రంలోని నీటిపారుదల శాఖ ప్రధాన కార్యాలయంలో ఫ్లడ్ కంట్రోల్‌రూం ఏర్పాటు చేశామని ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ మధుసూదన్‌రావు ఓ ప్రకటనలో తెలిపారు. వర్షాలతో ప్రజలకు ఇబ్బందులు ఎదురైతే కంట్రోల్ రూం 08462–221403 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం అందించాలని సూచించారు.

మెప్మా పీడీ బదిలీ

నిజామాబాద్‌నాగారం : పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) పీడీ సత్యనారాయణ బదిలీ అయ్యారు. డిప్యూటేషన్‌లో వచ్చి మెప్మా పీడీగా నాలుగేళ్ల 10 నెలల పాటు విధులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా బదిలీ అయ్యారు. ఆయనకు పదోన్నతి రావడంతో మదర్ డిపార్టుమెంట్ హైదరాబాద్‌లోని సమాచారశాఖలో ప్రాంతీయ ఇంజినీర్‌గా వెళ్లారు. గురువారం విధుల నుంచి రిలీవ్ కావడంతో ఉద్యోగులు సత్కరించారు.

ఇన్‌చార్జి పీడీగా మాధురిలత

మెప్మా ఇన్‌చార్జి పీడీగా మాధురి లతకు బాధ్యతలు ఇచ్చారు. ప్రస్తుతం ఆమె డిస్ట్రిక్ట్ మిషన్ కోఆర్డినేటర్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్నారు. కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు ఆదేశాల మేరకు ఇన్‌చార్జి బాధ్యతలు మాధురిలతకు అప్పగించారు. శుక్రవారం ఆమె బాధ్యతలు తీసుకోనున్నారు.

ఆర్మూర్ ఏసీపీగా జగదీశ్‌చంద్

ఖలీల్‌వాడి: ఆర్మూర్ ఏసీపీగా జగదీశ్‌చంద్ నియమితులయ్యారు. ఆయన ప్రస్తుతం రాచకొండ కమిషనరేట్‌లో సీసీఆర్‌బీలో ఏసీపీగా పని చేస్తున్నారు. ఇక్కడ ఉన్న ఏసీపీ ప్రభాకర్ అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొందారు. నిజామాబాద్ సీసీఆర్‌బీలో ఏసీబీలో వర్టికల్ ఫంక్షన్ ఏసీపీగా ఉన్న చంద్ పాషా హైదరాబాద్‌లోని సీసీఆర్‌బీకి బదిలీ అయ్యారు.

దర్యాప్తు వేగవంతం



ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్‌లోని జిరాయత్‌నగర్‌లో బుధవారం జరిగిన జంట హత్యల కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. గురువారం జిల్లా కేంద్రం నుంచి ఏసీపీ ప్రభాకర్ సమక్షంలో సీసీఎస్ బృందం ఘటన స్థలాన్ని పరిశీలించారు. నిందితుడు ఇంట్లోకి వచ్చి వెళ్లిన దృశ్యాలను సీసీ ఫుటేజీలో పరిశీలించారు. ఏసీపీ ప్రభాకర్‌రావు మాట్లాడుతూ నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. త్వరలోనే పట్టుకుంటామన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నవీపేట: మండలంలోని నాగేపూర్ సమీపంలోని బాసర రహదారి మూలమలుపు వద్ద గురువారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో కోస్లీ గ్రామానికి చెందిన అడెల్లి సాయిలు(40) మృతి చెందాడు. నవీపేట నుంచి కోస్లీ బైక్‌పై వెళ్తుండగా మూలమలుపు దగ్గర డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని గ్రామస్తులు తెలిపారు.

కరెంట్ షాక్‌తో గేదె..

బాన్సువాడ రూరల్: మండలంలోని ఇబ్రాహింపేట్‌లో బండి బాగన్నకు చెందిన గేదె గురువారం కరెంట్ షాక్‌తో మృతి చెందింది. ఇబ్రాహింపేట్ తండా సమీపంలో మేతకు వెళ్లి ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకడంతో షాక్ కొట్టి చనిపోయింది. ఉదయం అటువైపుగా వెళ్లిన గొర్రెల మందకు స్వల్పంగా విద్యుత్ షాక్ తగలటంతో వారు అధికారులకు సమాచారం అదించారు. అధికారులు కేవలం ముళ్ల కంచె అడ్డం పెట్టి వెళ్లడంతో ప్రమాదం జరిగిందని, వెంటనే సరి చేస్తే గేదె ప్రాణాలు దక్కేవని రైతు వాపోయాడు.

చెరువులో తేలిన మృతదేహం

బిచ్కుంద: బిచ్కుందలోని వడ్డెర కాలనీలో నివసిస్తున్న పల్లపు రాములు మృతదేహం గురువారం సాదర్ చెరువులో తేలిందని ఎస్సై శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఈ నెల 17న ఇంట్లో నుంచి వెళ్లిన రాములు తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. గురువారం చెరువులో మృతదేహం తేలడంతో రైతులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. గత కొన్ని ఏళ్ల నుంచి భార్య, పిల్లలు రాములును వదిలేసి దూరంగా ఉంటున్నారు. చిన్నమ్మ దగ్గర రాములు ఉంటున్నాడు. భార్య పిల్లలు దూరంగా ఉన్నారని మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని చెల్లెలు ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామని ఎస్సై తెలిపారు.

కోరలు చాస్తున్న వరకట్న రక్కసి

- ఆగని వేధింపులు
- ఠాణా మెట్లెక్కుతున్న జంటలు

మాచారెడ్డి: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతిని రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన యువకుడికిచ్చి రెండేళ్ల క్రితం వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో లాంఛనంగా కొంత నగదు, బంగారం, వెండి ఆభరణాలు ఇచ్చారు. అయినా అదనపు కట్నం కోసం తరచుగా వేధింపులకు గురి చేస్తూ తల్లి గారింటికి పంపించారు. పలుమార్లు పోలీస్ ఠాణాకు వెళ్లారు. అట్లా పలుమార్లు వేధింపులకు గురి చేస్తూ చితకబాదిన ఆ యువకుడికి పోలీసులు కౌన్సిలింగ్ చేసి ఆ యువతిని ఇటీవల కాపురానికి పంపించారు. మరో గ్రామానికి చెందిన యువతికి పెళ్లి సమయంలో కట్న కానుకలు ఇచ్చినా కట్న దాహం తీరని భర్త, అత్తమామలపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. పలుమార్లు కౌన్సెలింగ్ నిర్వహించినా మార్పు రాకపోవడంతో కోర్టు ద్వారా విడాకులు తీసుకున్నారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన వివాహితలు ఈ ఆర్నెళ్లలో నలుగురు ఠాణాకు రాగా 498 సెక్షన్ కింద కేసులు నమోదు చేసినట్లు మాచారెడ్డి ఎస్సై రాజారామ్ తెలిపారు. ఇదిలా ఉంటే గ్రామాల్లో కుల సంఘాల ఆధ్వర్యంలో పంచాయతీలు కొనసాగుతున్న కేసులు కోకొల్లలు. ఆడ పిల్లలు ఎంత చదువుకున్నా, ఏ స్థాయిలో ఉన్నా వరకట్న వేధింపులు తప్పడం లేదు.

వెలుగులోకి రానివి ఎన్నో..

వర కట్న వేధింపులతో పాటు గృహహింస కేసులు ఎన్నో ఉన్నాయి. చదువుకొని తమ కాళ్ల మీద తాము నిలబడ్డ యువతులు బయట పడుతున్నారు. కానీ చదువుకోని ఆడ పిల్లలు మాత్రం ఎంత వేధించినా బయట పడితే పరువు పోతుందనే కారణంతో కొట్టినా చంపినా భర్తే సర్వస్వం అంటూ ఆ నరకంలోనే మగ్గిపోతున్నారు.

> **బయటకు వస్తే న్యాయం జరుగుతుంది**
>
> 
>
> వరకట్న వేధింపులు, గృహహింసకు గురవుతున్న వివాహితలు బయట పడితే పరువు పోతుందనే కారణంతో అందులోనే మగ్గి పోతున్నారు. అలా కాకుండా అందరినీ ఎదిరించి బయటకు వస్తే తప్పకుండా న్యాయం జరుగుతుంది.
>
> – రాజారామ్, ఎస్సై, మాచారెడ్డి

అర్హులకు 'డబుల్' ఇళ్లు కేటాయించాలి

- జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి



వినతిపత్రం అందిస్తున్న జెడ్పీ ఫ్లోర్ లీడర్, పేదలు

రామారెడ్డి: రామారెడ్డి మండలం అన్నారం గ్రామంలో డబుల్ బెడ్ రూం ఇళ్లు ఏమీ లేని పేదవారికి కాకుండా ఇళ్లు ఉన్నవారికి మంజూరు చేశారని, కొన్ని సంవత్సరాల నుంచి కిరాయికి ఉంటున్నా తమన పట్టించుకోలేదని ఇళ్లు లేని బాధితులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం జెడ్పీ మోహన్‌రెడ్డితో కలిసి ఇల్లు లేనివారు రామారెడ్డి తహసీల్ కార్యాలయ సిబ్బందికి ఈమేరకు వినతి పత్రం అందజేశారు. అనంతరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ.. ఇళ్లు లేని వారికి కాకుండా ఉన్నవారికి కేటాయించారని అన్నారు. అర్హులకు కేటాయించాలని లేదంటే కాంగ్రెస్ పార్టీ పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతుందని హెచ్చరించారు. పోసానిపేట సర్పంచు గీరెడ్డి మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేను తప్పు చేయలేదని చెప్పండి

ఉపాధ్యాయులపై ఓ హెచ్‌ఎం ఒత్తిడి

నిజామాబాద్ అర్బన్: తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తమని చెప్పాలని ఓ హెచ్‌ఎం తన బడిలోని ఉపాధ్యాయులపై ఒత్తిడి చేస్తున్నారు. తనపై చర్యలు తీసుకోకుకుండా అడ్డుకోవాలని వారిని డీఈవో కార్యాలయం చుట్టు తిప్పుతున్నారు. ఇందల్వాయి మండలంలోని ఓ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంపై వచ్చిన ఫిర్యాదులపై ఇటీవల విద్యాశాఖ అధికారులు విచారణ చేపట్టారు. విచారణలో సదరు హెచ్‌ఎం నిబంధనలకు విరుద్ధంగా ఉపాధ్యాయులకు వేతనాలు మంజూరు చేసినట్లు తేలింది. అతడిపై చర్యలు తీసుకోవడానికి జిల్లా అధికారులు సిద్ధమయ్యారు. దీంతో ఆయన కొన్ని రోజులుగా జిల్లా విద్యాశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణాలు చేస్తున్నాడు. తన పాఠశాలకు చెందిన పది మంది టీచర్లను వెంటబెట్టుకొని తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవమని, తనకు సహకరించాలంటూ ఉపాధ్యాయులపై ఒత్తిడి తీసుకు వస్తున్నాడు. బడి వదిలేసి అందరు టీచర్లను తన వెంట తిప్పుకోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మహిళ టీచర్లకు సైతం ఫోన్లు చేస్తూ తాను చెప్పిన చోటుకు రావాలంటూ హుకుం జారీ చేస్తున్నాడు. దీంతో వారు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై డీఈవోకు ఫిర్యాదు చేసేందుకు ఉపాధ్యాయులు సిద్ధమవుతున్నారు. సదరు హెచ్‌ఎం గతంలో మరో ప్రాంతంలో పని చేసినప్పుడు కూడా మహిళా ఉపాధ్యాయులను పట్ల ఇబ్బందికరంగా ప్రవర్తించాడని ఆరోపణలు ఉన్నాయి. అంతేగాక జిల్లా విద్యాశాఖ, మండల విద్యాశాఖ అధికారులు చేపట్టే సమావేశాలకు గైర్హాజరు అవడం, వారి ఆదేశాలను పాటించకపోవడం అనే ఆరోపణలు ఉన్నాయి. హెచ్‌ఎం వేధింపులపై ఉపాధ్యాయులు ఓ ప్రధాన ఉపాధ్యాయ సంఘం నాయకులు ఫిర్యాదు చేశారు.

బాధ్యతలు స్వీకరించిన కమాండెంట్ రాంప్రకాశ్



డిచ్‌పల్లి: డిచ్‌పల్లిలోని ఏడో బెటాలియన్ కమాండెంట్‌గా బి రాంప్రకాశ్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. బెటాలియన్ అధికారులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సిబ్బంది నుంచి గౌరవవందనం స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తర్వాత బెటాలియన్ ఆవరణలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో కమాండెంట్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎస్ విష్ణుమూర్తి, సీ ఆంజనేయరెడ్డి, కే భాస్కర్ రావు తదితరులు పాల్గొన్నారు.

దోపిడీ కేసులో నిందితుడి అరెస్ట్



మాట్లాడుతున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: ఇద్దరిని కత్తితో బెదిరించి నగదు, బంగారం దోపిడీ చేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన వివరాలు వెల్లడించారు. వివరాలు.. నందిపేట మండలం వన్నెల్ గ్రామానికి చెందిన గండ్ల సాయి కుమార్ తన పరిచయస్తురాలు ఉమమహేశ్వరితో కలిసి ఈ నెల 13న మాక్లూర్ మండలం దాస్‌నగర్ వద్ద నిజాంసాగర్ కాలువపై బిర్యాని తిన్నాడు. మాక్లూర్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన కొమిరి రాజు వారిని కత్తితో బెదిరించి రూ.10 వేల నగదు, 6 గ్రాముల బంగారు మాటీలు ఎత్తుకెళ్లాడు. దీంతో బాధితులు మాక్లూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 19న దాస్‌నగర్ క్రాస్‌రోడ్డు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా పోలీసులను చూసి పారిపోతున్న రాజును పట్టుకొని విచారించగా నేరం ఒప్పుకున్నాడు. నిందితుడి నుంచి బంగారు మాటీలు, బైక్, కత్తి స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పర్చినట్లు ఏసీపీ తెలిపారు. సమావేశంలో నార్త్‌సీఐ సతీశ్‌కుమార్, ఎస్సై యాదగిరి గౌడ్, కానిస్టేబుళ్లు చందు, శ్రీను, బాల లింగం, రాజు, హోం గార్డ్ వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎయిర్ గన్‌తో బెదిరించి చోరీలు

- ఇద్దరు ప్రధాన నిందితుల అరెస్ట్
- భారీగా బంగారం, రూ.50 వేల నగదు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బంగారం, నగదు, గన్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిరణ్‌కుమార్

ఖలీల్‌వాడి: ఎయిర్ గన్‌తో బెదిరించి దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని నాగారం దొడ్డి కొమురయ్య కాలనీకి చెందిన షేక్ సాదక్, హోంశెట్టి రాజేష్ అలియాస్ రాజు మూడు నెలలుగా నగరంలోని పలు చోట్ల చోరీలు చేశారు. ఖిల్లా రోడ్డులోని మొగలుపూర్ కాలనీలో జూన్ 26న హింగోరా మహమ్మద్ ఉస్మాన్ ఇంట్లోకి చొరబడి 14 తులాల బంగారం, 3 సెల్‌ఫోన్లు ఎత్తుకెళ్లారు. ఈ కేసులో నిందితులు హోంశెట్టి రవి, సాయినాథ్, ఓ బాల నేరస్తుడిని ఈ నెల 8న అరెస్టు చేశారు. వారి నుంచి 17 గ్రాముల బంగారం, ఆటో, రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితులు సాదక్, రాజేశ్‌ను గురువారం ఎస్సై సాయినాథ్ అరెస్టు చేశారు. వారిపై ఇప్పటికే పలు కేసులు ఉన్నాయని ఏసీపీ తెలిపారు. షేక్ సాదక్ వద్ద ఎయిర్‌గన్, 25 గుళ్లు, రూ.20 వేల నగదు, 10.48 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నారు. రాజేష్ వద్ద 0.41 తులాల బంగారం, రూ.30 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ తెలిపారు. మిగతా నిందితులు రంజని, బొంబయ్యను త్వరలోనే పట్టుకుంటామన్నారు.